సాక్షి
తిరుపతి
సోమవారం । 27 । మే । 2024



ఉద్యోగాల కల్పనకు ముందడుగు

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. - 8లో



రూటు తప్పె.. రాబడి తగ్గె..!

తిరుపతి నుంచి చిత్తూరు వెళ్లు బస్సులు బైపాస్‌లో వెళ్లిపోతున్నాయి. దీంతో ఆర్టీసీకి రాబడి తగ్గుతోంది. - 8లో



కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం: ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం, వేసవి సెలవుల కారణంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

న్యూస్‌రీల్

గురుకుల అడ్మిషన్‌కు నేరుగా హాజరు తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 2024–25 విద్యాసంవత్సరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5 వ తరగతి ప్రవేశాలకు పరీక్ష రాసిన విద్యార్థులు అడ్మిషన్లకు నేరుగా హాజరుకావాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జిల్లా కో ఆర్డినేటర్ జయభారతి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష రాసిన ఎస్సీ బాలురు ఈనెల 28న ఉదయం 9 గంటలకు గురుకుల పాఠశాల (పూతలపట్టు)కు హాజరుకావాలని తెలిపారు. 5వ తరగతికి ప్రవేశ పరీక్ష రాసిన, రాయని ఎస్సీ,ఎస్టీ బాలికలు ఈ నెల 29న ఉదయం 10 గంటలకు గంగాధరనెల్లూరు గురుకుల పాఠశాల కు విచ్చేయాలని వెల్లడించారు. ప్రవేశ పరీక్ష రాసిన వారికి మొదటి ప్రాధాన్యతనిచ్చి, మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష రాయని వారికి అడ్మిషన్లు ఇస్తామని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలని డీసీఓ వెల్లడించారు.

ముత్యాలమ్మ సేవకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణలో పెద్దసంఖ్యలో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ నవీన్‌కుమార్, కమిటీ చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి ఏర్పాట్లు చేయించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామి అమ్మవార్లను సుమారు 29 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 1,752మంది, రూ.50 ప్రత్యేక టిక్కెట్ల ద్వారా 3,622మంది భక్తులు ముక్కంటిని సేవించుకున్నట్లు వివరించారు. అలాగే రూ.500 రాహుకేతు టికెట్ ద్వారా 3,028మంది, రూ.750 టికెట్ ద్వారా 1,240 మంది, రూ.1,500 టికెట్ ద్వారా 316మంది, రూ.2,500 టికెట్ ద్వారా 284మంది, రూ.5వేల టికెట్ ద్వారా 67 మంది పూజలు చేయించుకున్నట్లు వివరించారు. ఐదు రకాల ప్రసాదాలకు సంబంధించి మొత్తం 32,085 అమ్ముడైనట్లు వెల్లడించారు.



పూర్తిగా ఎండిపోయిన నేరేడుగుంట చెరువు (ఇన్‌సెట్) వయసు మీదపడడంతో ఎగరలేని స్థితిలో గూడబాతు, చెరువు ఒడ్డున మృత్యువాత పడిన పక్షి



వలస విలాపం

నేలపట్టు పక్షుల కేంద్రం.. వలస విహంగాలకు సంతానోత్పత్తి కేంద్రం.. సందర్శకులకు స్వర్గధామం.. శీతాకాలంలో విదేశీ పక్షుల కిలకిలరావాలతో కనువిందుగా ఉంటుంది. ఇప్పుడు సీజన్ ముగిసింది.. ఖండాలు దాటి వచ్చినవి తిరిగి స్వదేశాలకు వెళ్లిపోయాయి. మళ్లీ అంత దూరం ఎగరలేని కొన్ని మాత్రం ఇక్కడే మిగిలిపోయాయి. ప్రస్తుతం ఆహార కొరతతో అల్లాడిపోతున్నాయి. అడుగంటిన చెరువుల్లోనే క్షుద్బాధ తీర్చుకునేందుకు వెంపర్లాడుతున్నాయి. చుక్క నీరు లేని గుంతల ద్వారా ఆకలి తీరక ఎక్కడికక్కడ మృత్యువాత పడుతున్నాయి. పక్షి ప్రేమికులకు తీరని వేదన మిగులుస్తున్నాయి.

- నేలపట్టులో విదేశీ విహంగాల మృత్యుఘోష
- ఎక్కడికక్కడ అడుగంటిన నీటి వనరులు
- ఆహారం కోసం అల్లాడుతున్న పక్షులు
- అధిక సంఖ్యలో మృతి చెందుతున్న గూడబాతులు

దొరవారిసత్రం : మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం పరిధిలో గూడ బాతులు, నత్తగుల్ల కొంగలు పదుల సంఖ్యలో మరణిస్తున్నాయి. సాధారణంగా అక్టోబర్‌లో పలు దేశాల నుంచి వలస పక్షులు ఇక్కడకు వస్తుంటాయి. ఏప్రిల్ వరకు నేలపట్టులో సేదతీరుతూ సంతానం ఉత్పత్తి చేసుకుంటాయి. ఆ సమయంలోనే నేలపట్టుకు సందర్శకులు సైతం పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడి పక్షుల అందాలను వీక్షించి తన్మయత్వం చెందుతుంటారు.

ఎక్కడ పడితే అక్కడ..

పక్షుల కేంద్రంలో ఎక్కడ పడితే అక్కడ గూడబాతులు, నత్తగుల్లకొంగలు మృత్యువాత పడి కనిపిస్తున్నాయి. ఇవన్నీ ఆహారం లభ్యం కాక ఆకలితో అలమటించి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈవిషయంలో వన్యప్రాణి విభాగం అధికారులు కూడా ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. వలస పక్షులకు సమృద్ధిగా ఆహారం అందించే పులికాట్ సరస్సు సైతం ఎడారిగా మారింది. ఇదే కాకుండా చుట్టు పక్కల ప్రాంతాల్లోని చెరువులు కూడా ఎండిపోయాయి. దీంతో వలస పక్షులకు ఆహారం కొరత తీవ్రమైంది. గూడబాతులు ఆరోగ్యంగా ఉంటే 20 ఏళ్లు, నత్తగుల్ల కొంగలు అయితే 18ఏళ్లు జీవిస్తాయి. ఏదిఏమైనా ఖండాలు దాటి వేల కిలో మీటర్లు ప్రయాణం చేసి వచ్చిన విదేశీ విహంగాలు ఆహారం కొరతతో మరణించడం బాధాకరమని పక్షి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలస పక్షుల సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తెలుగు గంగ నీరు తీసుకువస్తే..

నేలపట్టు పక్షుల కేంద్రానికి తెలుగు గంగ నీరు వచ్చేలా నాలుగేళ్ల కిందటే కాలువ తీశారు. రెండేళ్ల కిందట అధికారుల చొరవతో గంగ జలాలు సైతం పక్షుల కేంద్రానికి వచ్చాయి. ఇక్కడి చెరువుల్లో నీరు చేరింది. దీంతో వలస పక్షులకు పుష్కలంగా ఆహారం లభించింది. అదే విధంగా ఈ ఏడాది కూడా తెలుగు గంగ నీటిని నేలపట్టు పక్షుల కేంద్రానికి తీసువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై వన్యప్రాణి విభాగం అధికారులను వివరణ కోరగా, వలస పక్షులు సీజన్ చివరిలో అనారోగ్యంతో మృతి చెందుతుంటాయని తెలిపారు. అవి మృత్యువాత పడడానికి ఆహారం కొరత కారణంగా కాదని వెల్లడించారు. పక్షుల కేంద్రం పరిధిలోని చెరువుల్లో నీరు లేకపోయినా, బయట ప్రాంతాల్లోని నదులు, చెరువుల్లో చేపలను వేటాడి ఆరగిస్తాయని వివరించారు.



అడుగంటిన అత్తిగుంట చెరువు

ఎగరలేక.. ఉండలేక

ఈ ఏడాది మార్చి ఆఖరుకే నేలపట్టులో వలస పక్షుల సీజన్ అయిపోయింది. ఇక్కడ బస చేసిన విదేశీ విహంగాలు తమ సొంత ప్రాంతాలకు వెళ్లిపోయాయి. అయితే వయసు మీరిన కొన్ని గూడబాతులు, నత్తగుల్ల కొంగలు మాత్రం వేలాది కిలోమీటర్లు ఎగరలేని పరిస్థితుల్లో ఇక్కడే ఉండిపోయాయి. ఇప్పుడు వాటి జీవనం కష్టతరంగా మారింది. పక్షుల కేంద్రం పరిధిలోని అత్తిగుంట చెరువు, మారేడుగుంట, నేరేడుగుంటలో నీరు అడుగంటడంతో వాటికి ఆహారం దొరకడం లేదు.



అరకొర నీటిలో ఆహారం కోసం వెతుకుతున్న గూడ బాతులు

మోక్ష ప్రదాత కటాక్షం



హనుమంత వాహనంపై కల్యాణ వెంకటేశ్వరుడు



పల్లకీపై ఉభయ నాంచారులతో శ్రీవారు



గజవాహనంపై కల్యాణ వెంకన్న

- వైభవంగా కల్యాణ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు
- హనుమ వాహనంపై ఊరేగిన శ్రీవారు
- వేడుకగా దేవదేవేరుల వసంతోత్సవం
- గజ వాహనంపై సర్వాంతర్యామి విహారం

నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఉదయం హనుమంత వాహనంపై ఊరేగుతూ కల్యాణ వెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు వేకువనే శ్రీవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. హోమశాలలో ప్రత్యేక క్రతువులు పూర్తి చేశారు. సర్వాలంకారభూషితుడైన కల్యాణ వెంకన్నను హనుమ వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం విశేషంగా అలంకరించిన దేవదేవేరులను పల్లకిలో వేంచేపు చేశారు. కనులపండువగా స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవీ సమేతంగా శ్రీవారికి వసంతోత్సవం నిర్వహించారు. మాడవీధుల్లో పరిచారకులపై సుగంధ తిరుచూర్ణ ద్రవ్యాలను చల్లారు. రాత్రి 7.30 గంటలకు గజవాహనంపై మోక్షప్రదాతగా స్వామివారు కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. గ్రామోత్సవంలో భక్తుల కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తికి ఆస్థానం నిర్వహించి, ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకుడు శ్రీధర భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం సూర్య ప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

సమానత్వం.. సంకీర్తనల సారం



మాట్లాడుతున్న అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ

తిరుపతి కల్చరల్ : సర్వమానవ సమానత్వమే అన్నమయ్య సంకీర్తనల సారామని అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ తెలిపారు. అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో చేపడుతున్న సాహితీ సదస్సులు ఆదివారంతో మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన విభీషణ శర్మ మాట్లాడుతూ అన్నమయ్య- యోగ సంకీర్తనలు అనే అంశంపై ఉపన్యసించారు. రామానుజాచార్యుల వారు వెల్లడించిన అష్టాక్షరి మంత్రంతో పాటు శ్రీవైష్ణవ ధర్మం, భక్తి తత్వాన్ని అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా ప్రచారం చేసినట్లు వివరించారు. అన్నమయ్య యోగ సంకీర్తనల్లో ధర్మం, భక్తి, శరణాగతి, అహింస ప్రధానంగా పేర్కొన్నారని వెల్లడించారు. అనంతరం ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ సర్వోత్తమరావు అన్నమయ్య- శ్రీనివాసుని అభిషేక సంకీర్తనలు అనే అంశంపై మాట్లాడుతూ తిరుమల శ్రీవారికి శుక్రవారం రోజునే ఎందుకు అభిషేకం నిర్వహిస్తారో అన్నమయ్య తెలియజేశారన్నారు. శ్రీవారికి సమర్పించే నిత్యం కై ంకర్యాలను ఆయన క్షుణ్ణంగా వివరించారు. అన్నమయ్య సంకీర్తనలు - భగవద్గీతా ప్రభావం అనే అంశంపై సాహితీ వేత్త గొరిపెద్ది వేంకట శంకర భగవాన్ ప్రసంగించారు. కర్మ, జ్ఞాన, ధ్యాన , తత్వ మార్గాలు భగవంతుని చేరడానికి అంత సులభం కావు, అవేవీ ఉపాయాలు కావు, శరణాగతి కోరే భక్తి మార్గమొక్కటే శ్రీహరి పాదాల చెంతకు చేర్చి మోక్షప్రాప్తి పొందుటకు మార్గమని అన్నమయ్య చాటి చెప్పారని తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలు అర్థం చేసుకుంటే వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలన్నీ అర్థమైనట్లేనన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోకిల పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో ఏజెంట్లు కీలకం!

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓట్లు లెక్కింపును జూన్ 4వ తేదీన తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ఆ మేరకు ఇప్పటికే 95శాతం ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రశాంతవాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో కౌంటింగ్ రోజున వివిధ పార్టీల ఏజెంట్లు సైతం కీలక పాత్ర పోషించనున్నారు. ఇందుకోసం నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముందని పలువురు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని కోరుతున్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

- నిబంధనలపై అవగాహన అవసరం
- నిశిత పరిశీలనకు ప్రాధాన్యం
- ఓట్ల లెక్కింపులో అత్యంత అప్రమత్తం

తిరుపతి అర్బన్ : ఓట్ల లెక్కింపులో ఏజెంట్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. ప్రధానంగా లెక్కింపు సందర్భంగా పాటించాల్సిన నిబంధనలపై ఏజెంట్లకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలి. లేదంటే కౌంటింగ్ ప్రక్రియ గందరగోళంగా మారే ప్రమాదం ఉంది. సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ఫారమ్–17సీ ఎంతో కీలకమైనది. ప్రతి కౌంటింగ్ ఏజెంట్, పరిశీలకులు, సహాయ పరిశీలకులకు దీనిపై అవగాహన ఉండాలి. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారమ్–17 సీలో పొందుపరిచిన మొత్తం ఓట్లు సరిపోల్చి చూసుకోవాలి. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గం నంబర్, పోలింగ్ కేంద్రం పేరు, అక్కడ వినియోగించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ల గుర్తింపు నంబర్లను ఆ ఫారమ్‌లోనే నమోదు చేస్తారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల సంఖ్య, ఓటు వేయడానికి వచ్చినవారి సంఖ్య, పోలింగ్ కేంద్రంలోకి వచ్చాక ఓటు వేయడానికి నిరాకరించి వెళ్లిపోయిన వారి సంఖ్య, ఓటు వేసేందుకు పీఓ అనుమతించని వారి సంఖ్య, ఓటింగ్ యంత్రంలో నమోదైన మొత్తం ఓట్ల సంఖ్య ఫారమ్–17సీలో ఉంటాయి. టెండర్ బ్యాలెట్లు, సరఫరా చేసిన పేపర్ సీళ్లు (ఓటరుకు పోలింగ్ కేంద్రంలో ఇచ్చే రెండు రంగుల స్లిప్‌లు), సీరియల్ నంబర్లు, ఎన్ని పేపర్లు వినియోగించారు. వినియోగించని పేపరు సీళ్లు ఎన్ని తిరిగి రిటర్నింగ్ అధికారికి వెళ్లాయి. పాడైపోయిన పేపర్ సీళ్లు, సీరియల్ నంబర్ల తదితర అంశాలను నిశితంగా గుర్తించాల్సి ఉంటుంది.



కౌంటింగ్ కేంద్రం పరిశీలనలో జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

వరుస క్రమంలో లెక్కింపు

కౌంటింగ్ ఒక రౌండ్ పూర్తయిన వెంటనే అందులోని రెండు కంట్రోల్ యూనిట్లను జనరల్ అబ్జర్వర్ తన టేబుల్ వద్దకు తెప్పించుకుంటారు. అదనపు పరిశీలకులతో ఓట్లు లెక్కిస్తారు. కంట్రోల్ యూనిట్‌లోని ఓట్ల సంఖ్యకు ఫారమ్–17సీ, పార్టు–2లో కౌంటింగ్ సూపర్‌వైజర్ నమోదు చేసిన ఓట్ల సంఖ్యకు సమానంగా ఉంటే ఇబ్బంది లేదు. ఒకవేళ ఏదైనా తేడా వస్తే పరిశీలకుడు తనిఖీ చేసిన మిగిలిన కంట్రోల్ యూనిట్లన్నిటినీ జనరల్ అబ్జర్వర్ మరోసారి లెక్కిస్తారు. వివరాలు తప్పుగా నమోదు చేసిన కౌంటింగ్ పరిశీలకుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. అసాధారణంగా ఇద్దరు అభ్యర్థులకు కౌంటింగ్ ఓట్లు సమానంగా వస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం రిటర్నింగ్ అధికారి లాటరీ ద్వారా ఫలితం ప్రకటిస్తారు.

తేడా వస్తే..!

కౌంటింగ్ సమయంలో టేబుల్ వద్దకు కంట్రోల్ యూనిట్‌తో పాటు ఫారమ్–17సీలోని వివరాలను ఏజెంట్లు తప్పనిసరిగా రాసుకోవాలి. కంట్రోల్ యూనిట్ డిస్‌ప్లే సెక్షన్‌లో చూసిన పోలైన మొత్తం ఓట్లు, ఫారమ్–17సీలో నమోదు చేసిన ఓట్ల సంఖ్య సమానంగా ఉండాలి. క్లరికల్ తప్పిదం, మరో కారణంతో కానీ కంట్రోల్ యూనిట్ ఫారమ్–17సీలో ఓట్ల సంఖ్యలో తేడా వస్తే అది వివాదాస్పదంగా మారుతుంది. అలాంటి కంట్రోల్ యూనిట్లను రిటర్నింగ్ అధికారి పక్కన ఉంచి ఎన్నికల కమిషన్‌కు సమాచారం అందిస్తారు. కంట్రోల్ యూనిట్ టేబుల్ పైకి రాగానే ఏజెంట్ల పరిశీలనకు ఉంచుతారు. ఆ కంట్రోల్ యూనిట్ ఏ పోలింగ్ కేంద్రానికి చెందినదో ఏజెంట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి



వ్రతం ఆచరిస్తున్న భక్తులు

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్థిని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని మూలమూర్తికి ప్రత్యేక అభిషేకపూజలు, అలంకరణలు చేశారు. సాయంత్రం శ్రీస్వామివారి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగింపుగా ఆస్థాన మండపానికి తీసుకు వచ్చి వేదికపైకి కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి సామూహికంగా సంకట హర చతుర్థి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రత పూజల్లో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు స్వర్ణ రథోత్సవం నయనానందకరంగా సాగింది. అశేష భక్తులు జై గణేషా..జైజై గణేశ అంటూ స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. దేవస్థానం ఈఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ విద్యాసాగర్, అధికారులు కోదండపాణి, వాసు రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణ రథంలో కొలువుదీరిన స్వామివారు

ఎర్రచందనం పట్టివేత

తిరుపతి మంగళం: రాపూరు సమీపంలోని మళ్లమ్మకోన బాట వద్ద ఆరు ఎర్రచందనం దుంగలతోపాటు ఒక కారును టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాలు మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ అటవీశాఖ అధికారులు వై. మస్తాన్, ఎం. ప్రవీణ్ కుమార్ ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ కారులో ఎర్రదుంగలను లోడ్ చేయడం గమనించిన టాస్క్ ఫోర్స్ సిబ్బంది వారిని చుట్టుముట్టేందుకు యత్నించగా స్మగ్లర్లు అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో కారు, ఎర్రదుంగలను స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు. సీఐ జి. శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

'కోడ్' ఉల్లంఘించిన ఉద్యోగి


పులివర్తి నానితో టీటీడీ ఉద్యోగి నాగరాజు

చంద్రగిరి : ఎన్నికల కోడ్‌ను టీటీడీ టైం స్కేల్ ఉద్యోగి ఉల్లంఘించడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. చంద్రగిరి పాతపేట రెడ్డివీధికి చెందిన నాగరాజు టీటీడీ టైం స్కేల్ వాహన బేరర్‌గా గోవిందరాజ స్వామివారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన నిబంధనలకు విరుద్ధంగా టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ధార్మిక సంస్థలో పనిచేస్తూ రాజకీయ నేతను పరామర్శించడం వివాదాస్పదంగా మారింది. దీనిపై టీటీడీ అధికారులు విచారించి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

చిల్లకూరు : పాత ఇనుప సామాను చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను ఆదివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని అంకుపాటూరు గ్రామంలో మూత బడిన ఎస్‌బీక్యూ స్టీల్ పరిశ్రమలో పాత సామాను నెల్లూరు హౌసింగ్ బోర్డుకు చెందిన తిరుమల వడివేలు, అరవ శేఖర్ అపహరించి ఆటోలో తరలిస్తుండగా కంపెనీ భద్రతా సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ సిరాజ్ వెంటనే స్పందించి నిందితులను వెంటాడి ఆటోలోని సామానుతో పాటుగా వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కోర్టు హాజరుపరిచి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిల్లకూరు : మండలంలోని కడివేడు వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. సైదాపురం మండలం గిద్దలూరుకు చెందిన వేణుగోపాల్(55) చిల్లర దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కోట పట్టణంలోని తన బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఉండగా కడివేడు వద్ద నేదురుమల్లి రాజ్యలక్ష్మి గిరిజన కాలనీ దాటిన తర్వాత రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొన్నాడు. 108 వాహనంలో క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వేణుగోపాల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూటు తప్పె.. రాబడి తగ్గె..!

- దారి మార్చిన ఆర్టీసీ సర్వీసులు
- తిరుపతి బస్టాండ్ నుంచి బైపాస్‌లో వెళుతున్న బస్సులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


తిరుపతి బస్టాండ్‌లో బస్సులు

తిరుపతి అర్బన్: జిల్లాల పునర్విభజనలో భాగంగా చిత్తూరు, తిరుపతి రెండు జిల్లాలు అయినప్పటికీ ఈ రెండు నగరాలకు ఉద్యోగం, వ్యాపారం నేపథ్యంలో అనుబంధం కొనసాగుతోంది. ఈ క్రమంలో నిత్యం వందలాది మంది తిరుపతి నుంచి చిత్తూరుకు, చిత్తూరు నుంచి తిరుపతికి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతి టూ చిత్తూరుకు రోజు 135 సర్వీసులు నడుస్తున్నాయి. ప్రధానంగా తిరుపతి నుంచి బెంగళూరుకు 65 సర్వీసులు చిత్తూరు మీదుగా వెళుతాయి. అంతేకాకుండా తిరుపతి నుంచి రాయవేలూరుకు 20 సర్వీసులు, తిరుపతి నుంచి చిత్తూరుకు 50 సర్వీసులు తిప్పుతున్నారు. అన్నీ సర్వీసులు రోజు ఫుల్‌గానే ఉంటాయి. ఇక్కడి వరకు బాగానే ఉంది. అయితే తిరుపతి నుంచి చిత్తూరుకు వెళ్లే సర్వీసులు రైల్వే స్టేషన్, న్యూబాలాజీ కాలనీ, ఎస్వీ యూనివర్సిటీ మీదుగా నడుస్తుంటాయి. మరి కొన్ని సర్వీసులు లీలామహల్, కపిలతీర్థం, అలిపిరి, ఎస్వీ యూనివర్సిటీ మీదుగా చిత్తూరు నడపాల్సి ఉంది. ఇంకొన్ని సర్వీసులు ఎయిర్ బైపాస్ రోడ్డు,అన్నమయ్య సర్కిల్, ఎంఆర్‌పల్లె కూడలి మీదుగా ఎస్వీ యూనివర్సిటీ నుంచి చిత్తూరుకు వెళ్లాల్సి ఉంది. ఈ మార్గాల్లో బస్సులు వెళితే తిరుపతి నగరంలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు చిత్తూరుకు వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. జన సంచారం ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతాల మీదుగా వెళ్లడంతో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుందనే ఉద్దేశంతోనే ఆర్టీసీ వారు ఏళ్ల తరబడి ఆయా మార్గాల మీదుగా బస్సులు నడుపుతున్నారు.

మార్గం మార్చారు

అయితే అలా వెళ్లకుండా బస్టాండ్ నుంచి రామానుజ సర్కిల్ మీదుగా తిరుచానూరు మామిడికాయల మండీ మార్గం మీదుగా బైపాస్‌పై వెళ్లిపోతున్నారు. బస్టాండ్‌లో 20 శాతం టిక్కెట్లు ఎక్కించుకుని ఇలా అడ్డదారిలో నడుపుతున్నారు. సాధారణంగా బస్టాండ్‌లో ప్రతి సర్వీస్‌కి 20 నుంచి 25 శాతం ప్రయాణికులు ఎక్కుతారు. మిగిలిన వారు బజారులో ఎక్కడంతో ఎస్వీ యూనివర్సిటీ ప్రాంతానికి వెళ్లే సమయానికి 100 శాతం ప్రయాణికులతో బస్సు ఫుల్ అవుతుంది. అయితే తిరుచానూరు మామిడికాయల మండీ మీదుగా వెళ్లడం ద్వారా కేవలం 20 నుంచి 25 శాతం మంది ప్రయాణికులతో ఆర్టీసీ సర్వీసులు నడపాల్సి ఉంటుంది. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడడంతోపాటు తిరుపతి నగరంలోని ప్రయాణికులకు పెద్ద ఎత్తున ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అంతా ఆర్టీసీ బస్టాండ్‌కు రావాల్సి వస్తోందని వాపోతున్నారు. తిరుచానూరు బైపాస్ మీదుగా ఆర్టీసీ సర్వీసులు వెళ్లడం ద్వారా ట్రాఫిక్ లేకుండా వెళ్లిపోవచ్చునని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు భావిస్తున్నారు. అయితే ప్రయాణికుల సౌకర్యాన్ని గుర్తించడం లేదు. మరోవైపు తిరుచానూరు బైపాస్ మీదుగా వెళ్లడానికి వీలులేదు. అయితే ఆర్టీసీ నిబంధనలకు విరుద్ధంగా పలువురు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు మండిపడుతున్నారు.

> **నిఘా పెడతాం**
>
> 
>
> చిత్తూరు మీదుగా వెళ్లే సర్వీసులు బస్టాండ్ నుంచి బజారులోనే ఎస్వీ యూనివర్సిటీ మీదుగా వెళ్లాల్సి ఉంది. బస్టాండ్‌లో ప్రయాణికులతో ఫుల్ అయినప్పటికీ బజారులోనే వెళ్లాలి. అంతేతప్ప తిరుచానూరు బైపాస్‌లో వెళ్లడానికి లేదు. మరోసారి అన్ని సర్వీసులపై నిఘా పెడుతాం. డ్రైవర్లు, కండక్టర్లుకు స్పష్టంగా తెలియజేస్తాం. ఆయా డిపో మేనేజర్లకు సమాచారం అందిస్తాం. అయినప్పటికీ ఆర్టీసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు.
>
> – డీఆర్ నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి

సంతకం లేకుంటే.. 'బ్యాలెట్' అవుట్

తిరుపతి అర్బన్ : పోస్టల్ బ్యాలెట్ నిబంధనలను ఎన్నికల సంఘం స్వల్పంగా సవరించింది. గతంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు చెల్లుబాటుకు రిటర్నింగ్ అధికారితోపాటు గెజిటెడ్ సంతకం, సీల్ తప్పనిసరిగా ఉండాల్సి ఉండేది. అయితే ఇప్పుడు ఆర్‌ఓ, గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి అయినా, సీల్ లేకపోయినా చెల్లుబాటు అయ్యేలా నిబంధలను మార్పు చేశారు. ఎన్నికల సంఘం డ్యూటీలోని ఉద్యోగులతోపాటు, అత్యవస సేవలను అందించే 33 విభాగాలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయడానికి అవకాశం కల్పించారు. ఈ క్రమంలో 20,153 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. అయితే 2019 ఎన్నికల్లో 20 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వివిధ కారణాలతో చెల్లుబాటు కాలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎంతమంది తమ బ్యాలెట్‌పై సంతకాలు, సీల్ వేయించుకున్నారనేది కౌంటింగ్ తర్వాత వెల్లడి కానుంది.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

గూడూరు :	2,639
సూళ్లూరుపేట :	1,978
వెంకటగిరి :	2,419
తిరుపతి :	4,414
శ్రీకాళహస్తి :	2,691
సత్యవేడు :	1,520
చంద్రగిరి :	4,492
మొత్తం :	20,153

ఆలయం జోలికొస్తే సహించం


మాట్లాడుతున్న శివనాయక్ తదితరులు

తిరుపతి రూరల్ : హథీరాం బావాజీ ఆలయం జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని గుడి నిర్మాణ కమిటీ కన్వీనర్ శివనాయక్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి రూరల్ మండలం వేదాంతపురంలోని బావాజీ ఆలయం వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామివారితో పాచికలు ఆడిన బావాజీ ఆలయాన్ని నిర్మిస్తే హథీరాంజీ మఠం ఏఓ రమేష్‌నాయుడు కూలగొట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. బంజారా జాతి ఆరాధ్యదైవంగా బావాజీని కొలుస్తుంటారని, అందుకే బంజారాలందరం విరాళాలు వేసుకుని ఆలయం నిర్మించామన్నారు. రూ.వేల కోట్ల ఆస్తులు ఉన్నప్పటికీ హథీరాంజీ మఠం అధికారులు మాత్రం బావాజీ గుడి నిర్మాణానికి సహకరించలేదని, పైగా కూల్చేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.

విద్వేషాలు రెచ్చగొట్టేలా..

హథీరాం బావాజీ ఆలయాన్ని కూల్చివేసేందుకు ఏఓ రమేష్‌నాయుడు విద్వేషాలు రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని వెల్లడించారు. సాధిక్ బాషాతో కలిసి కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే రమేష్‌నాయుడు ప్రోద్బలంతో సాధిక్‌బాషా 50 మంది రౌడీలతో కలిసి శనివారం ఆలయాన్ని కూల్చివేసేందుకు వచ్చి బీభత్సం సృష్టించారన్నారు. ఆలయ పూజారిని రమేష్‌నాయుడు కులం పేరుతో దూషించి, కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రమేష్‌నాయుడు, సాధిక్‌బాషాపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్, ఎస్పీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు శివనాయక్ తెలిపారు. దీనిపై ఏఓ రమేష్‌నాయుడిని వివరణ కోరగా మఠం భూమిలో ఆక్రమణలను తొలగించేందుకు యత్నించామని, అందులో భాగంగానే సాధిక్‌బాషాను సాయం కోరినట్లు వెల్లడించారు.

'పచ్చ' అరాచకం పరిశీలన

- టీడీపీ నేతల విధ్వంస వైఖరిపై ప్రజల ఆందోళన
- ఇటీవల సర్పంచ్ ఇల్లు కాల్చివేత, ఇప్పుడు ప్రభుత్వ భవనం కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..


టీడీపీ నేతలు కూల్చేసిన పాల సెంటర్ భవనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మారుతి

చంద్రగిరి : ప్రభుత్వ భూమిని అక్రమంగా కాజేయాలనే దురుద్దేశంతో టీడీపీ నేతలు ఓ భవనాన్ని ధ్వంసం చేసిన ఘటనపై రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని శేషాపురంలో సర్వే నంబరు 100లోని ప్రభుత్వ స్థలంలో పాల సెంటర్ భవనం ఉండేది. ఈ స్థలాన్ని కబ్జా చేయాలనే కుట్రతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కేశవులు నాయుడు, ఆయన కుమారులు జేసీబీ సాయంతో పాల సెంటర్ భవనాన్ని కూల్చేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో కందులవారిపల్లిలో ''టీడీపీ నాయకుల ఆరాచకం'' శీర్షికతో ఆదివారం ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ మారుతి తన సిబ్బందితో కలసి పాల సెంటర్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా పాల సెంటర్ భవనంలో అంగన్ వాడీ కేంద్రం కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నామని స్థానికులు వెల్లడించారు. అయితే కేశవుల నాయుడు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు అనేక విధాలుగా ప్రయత్నించినట్లుగా స్థానికులు తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. రూ.లక్షల విలువైన భూమిని ఆక్రమించుకునేందుకు భవనాన్ని కూల్చేశారంటూ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

బిక్కు బిక్కుమంటూ..

టీడీపీ నాయకుల అరాచకాలపై మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నికల పోలింగ్ సమయంలో రామిరెడ్డిపల్లె సర్పంచ్ ఇంటిని టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన ఘటనను మరువక ముందే ప్రభుత్వ భవనం కూల్చేయడంతో ఆందోళన చెందుతున్నారు. టీడీపీ నాయకుల ఆగడాలు మితిమీరడంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఘటన జరిగి వారం రోజులు గడిచినా రెవెన్యూ, పోలీసు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మారుతి తెలిపారు. ఇప్పటికే భవనం కూల్చివేతపై ఐదుగురు అనుమానితులను గుర్తించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూమి కబ్జా చేయాలని చూస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ మేరకు పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

ఉద్యోగాల కల్పనకు ముందడుగు



యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ నూతన సంస్కరణలకు నాంది పలికింది. ఉపాధి కల్పనే ధ్యేయంగా సాంకేతిక వ్యవస్థను ఉపయోగించి జిల్లాలో ఉన్న ఉపాధి కార్యాలయాల స్వరూపాన్ని మార్చివేసింది. గతంలో అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ కార్యాలయాలకు రోజుల తరబడి తిరిగి క్యూలో నిలబడి విద్యార్హతల వివరాలను నమోదు చేసుకునేవారు. ఉద్యోగాల సమాచారం అభ్యర్థికి తెలిసేది కాదు. నేడు ఒక్క క్లిక్‌తో సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా వెసులుబాటు వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించారు. దీనిని నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం చేశారు.

– తిరుపతి సిటీ



యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నిరుద్యోగ యువత ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ ద్వారా ఇంటివద్ద నుంచే చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. httpr://empoyment.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే లాగిన్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్ సదరు ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా పొందవచ్చు. ఎంప్లాయిమెంట్ కార్డును సైతం లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవచ్చు. దీంతో పాటు ఎంప్లాయిమెంట్ కార్డ్ రెన్యూవల్, అదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు సైతం ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు అవకాశం ఉంటుంది.

> **అవకాశాలను ఉపయోగించుకోవాలి**
>
> రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో యువత కోసం పెద్ద ఎత్తున జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. పదోతరగతి నుంచి ఉన్నత విద్య అభ్యసించిన వారు ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. దీంతో ఎప్పటికప్పుడు యువతకు కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు ఉద్యోగాల ఖాళీల సమాచారం పొందవచ్చు. రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన ఫోన్ నంబర్ యూజర్ ఐడీగా పరిగణిస్తారు. యువత ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.
>
> – గోపికృష్ణ శ్రీనివాస్, ఎంప్లాయిమెంట్ కార్యాలయ అధికారి, తిరుపతి

- ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రత్యేక పోర్టల్
- ఒక క్లిక్ దూరంలో ఉద్యోగ అవకాశం
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌తో సులువుగా ఉద్యోగ సమాచారం
- నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం
- మోడల్ కెరీర్ సెంటర్లుగా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీలు

అతిసులువుగా ఉద్యోగ సమాచారం

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు జారీ చేసిన నోటిఫికేషన్ల సమగ్ర సమాచారం, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాల ఖాళీల వివరాలు ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు నేరుగా ఎప్పటికప్పుడు అతి సులువుగా ఉద్యోగావకాశాల సమాచారం అందుతుంది. విద్యార్హతల ప్రకారం ఉద్యోగాల ఖాళీలు వివరాలు యువత ఫోన్ నంబర్లకు, ఈమెయిల్‌కు అలెర్ట్ మెసేజ్ వస్తుంది. వీటితో పాటు ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం అందిస్తూ అటు యువతకు, ఇటు సంస్థలకు వారధిగా ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది నిలుస్తున్నారు.

> **జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ షురూ**
>
> తిరుపతి జిల్లాలో ఎంప్లాయిమెంట్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. తద్వారా యువత పెద్ద ఎత్తున తమ విద్యార్హతలను నమోదు చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని, ప్రైవేటు సంస్థలలోని ఉద్యోగావకాశాల వివరాలను పోర్టల్ ద్వారా పొందుతూ, ఎప్పటికప్పుడు తమ వివరాలను అప్‌డేట్ చేసుకుంటున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలంటే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు నంబర్ తప్పనిసరి అనే నిబంధన ఉండేది. ప్రస్తుతం అటువంటి నిబంధనలకు చరమగీతం పాడుతూ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకువచ్చింది.
>
> 

